క్లుప్తంగా

ఆసరా సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ముద్దాడ బైరాగినాయుడు

పోలాకి: మండల కేంద్రంలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న ఆసరా సభను విజయవంతం చేయాలని మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు అన్నారు. బుధవారం మహిళా సమైఖ్య సిబ్బంది, గ్రామ సంఘాల అధ్యక్షులతో సమావేశమయ్యారు. సభకు వచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. మండలంలో 5,400 మంది లబ్ధిదారులకు సంబంధించిన దాదాపు రూ.11 కోట్లు ఆసరా ద్వారా లబ్ధి జరగనుందని ఏపీఎం రాజారావు అన్నారు. అనంతరం పోలాకిలో స్థల పరిశీలన చేశారు.

చిత్రలేఖన ఉపాధ్యాయునికి సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న డ్రీమ్ ఆర్ట్ అకాడమీ సభ్యులు

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జన్ని రమేష్‌కు ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. విజయవాడలో డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు సన్మానించినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనంలో ఉత్తమ శిక్షణిచ్చి, వారు చిత్రలేఖనంలో రాణించేందుకు కృషి చేస్తున్నందుకు సన్మానించినట్లు పేర్కొన్నారు.

నిబంధనల మేరకు జీఎస్టీ చెల్లించాలి

నరసన్నపేట: మిల్లర్లు బియ్యం విక్రయాలకు సంబంధించి నిబంధనల మేరకు జీఎస్టీ చెల్లించాలని కాశీబుగ్గ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ వెంకట పద్మ సూచించారు. స్థానిక జమ్ము కూడలి వద్ద బుధవారం తనిఖీలు నిర్వహించారు. బొరిగివలస నుంచి సారవకోటకు ఒక మిల్లర్ 120 బియ్యం ప్యాకెట్లు తరలిస్తుండగా వాటిని పట్టుకుని పరిశీలించారు. బిల్లులో ఒక్కో ప్యాకెట్ 26 కేజీలు అని ఉండగా.. వాస్తవ బరువు 25 కేజీలు ఉండటంతో జీఎస్టీ చెల్లించాల్సిందేనని మిల్లర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సవరించిన నిబంధన మేరకు 25 కేజీల బియ్యం ప్యాకెట్‌కు విధిగా జీఎస్టీ చెల్లించాలని సూచించారు. మిల్లర్లు జీఎస్టీ ఎగ్గొంటేందుకు ఇన్వాయిస్‌లో 26 కేజీలు రాస్తూ.. వాస్తవ బరువు మాత్రం 25 కేజీలతో ప్యాక్ చేస్తున్నారన్నారు. ఈ విధంగా మిల్లర్లు తప్పుడు పద్ధతులతో బియ్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ బియ్యం మిల్లర్‌కు నోటీసులు ఇచ్చి జీఎస్టీ వసూలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: మండలంలోని కిట్టలపాడు పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కలిశెట్టి శ్యామలరావుతోపాటు మరో 12 కుటుంబాలకు చెందినవారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో బుధవారం చేరారు. వారికి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, లుకలాపు శ్రీనివాసరావు, గొర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాదాల జోలికి వెళ్లొద్దు



గోకర్ణపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీస్ అధికారు

పొందూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వివాదాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వై.రవికుమార్ అన్నారు. పొందూరు మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామాలైన గోకర్ణపల్లి, రంగనాథపేటలో బుధవారం స్పెషల్ ఫోర్స్ పోలీసులతో వీధుల్లో కవాతు నిర్వహించారు. అ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ప్రధానంగా యువత ఎన్నికల సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడినా బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని హెచ్చరించారు. ఏఎస్ఐ సువ్వారి రామచంద్రరావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- రావులవలసలో రూ.2.06 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ..అభివృద్ధి కార్యక్రమాలు కూడా ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వం చేపట్టిందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రావులవలసలో బుధవారం పర్యటించారు. రూ.1.26 కోట్లతో గుండవల్లిపేట–రావులవలస మధ్య నిర్మించిన రహదారిని, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.40 లక్షలతో జల్ జీవన్ ద్వారా నిర్మించిన ఇంటింటికీ కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ కావాలన్నారు. అధికారం కోసం చంద్రబాబు కూటమి అనేక హామీలు ఇస్తుందన్నారు. వాటిని చూసి మోసపావద్దని ప్రజలను కోరారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎప్పుడూ ప్రజలను పట్టించుకోలేదన్నారు. ఈ ఐదేళ్లలో జగనన్న ఎంత బాగా అభివృద్ధి పనులు చేపట్టారో.. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎలా లబ్ధిచేకూర్చారో గుర్తుచేసుకోవాలన్నారు. రావులవలస తన సొంత గ్రామం మబగాంతో సమానమన్నారు. ఇప్పటికే అనేక సమస్యలు పరిష్కరించామని, మిగిలిన సమస్యలు కూడా రానున్న ఐదేళ్లలో పరిష్కరిస్తానన్నారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ ఎటువంటి వివక్షత లేకుండా రావులవలసలో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అందరూ ఐక్యంగా ఉండి రానున్న ఎన్నికల్లో మళ్లీ మంచి మెజార్టీ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, సర్పంచ్ పల్లి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లి బుల్లయ్య, పంచిరెడ్డి సత్యం, ఎం.కృష్ణ, పల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- రావులవలసలో గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాల లబ్ధి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. రావులవలసలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యేకు, వైఎస్సార్‌సీపీ నాయకులకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఐదేళ్ల కాలంలో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ ఏఈ మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ సురంగి నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయిలు

- రూ.12 కోట్లతో 61 గ్రామాలకు తాగునీరు సరఫరా
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



తాగునీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: తాగునీటి ఎద్దడి నివారణకు జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలో రూ.12 కోట్లతో 61 గ్రామాలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రొమదలలో రూ.29.2 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన మంచినీరు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జి.మధుసూదనరావు, జేఈ కల్యాణ్‌రామ్, ఎంపీడీఓ రామకృష్ణరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.ప్రదీప్, సచివాలయ మండల కన్వీనర్ వై.సూర్యం, నాయకులు గేదెల సూర్యం, అప్పలనాయుడు, అర్జునరావు, ఇప్పిలి ధనుంజయ, ఎస్.శ్రీనివాసరావు, బి.శ్రీరాములు, చాపర తెజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



రుగడ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే పాతపట్నం నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని రుగడ, పిండ్రువాడ, అంబావల్లి, కిట్టాలపాడు, కొండరాగోలు, గులుమూరులో సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను, సేవలను తెచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మీసాల వెంకటరామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, ఎంపీటీసీలు ఎల్.సావిత్రి, వంగపల్లి చిన్నారావు, సర్పంచ్ చిరంజీవి, నాయకులు అల్లు కృష్ణారావు, ఎల్.శ్రీనివాసరావు, నక్క ఆనందరావు, పాపయ్య, శ్రీరాములు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



తుంగతంపరలో అవగాహన కల్పిస్తున్న మేనేజర్ షన్ముఖ

హిరమండలం: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని హిరమండలం ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ షన్ముఖ అన్నారు. భగీరథపురం, తుంగతంపర, కొల్లివలసలో నాబార్డు సౌజన్యంతో హిరమండలం ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ అక్షరాస్యత ఉంటేనే ఆ ఇల్లు అభివృద్ధి చెందుతుందన్న విషయం గుర్తించుకోవాలన్నారు. అందుకే పిల్లల చదువును ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం



ఆమదాలవలస రూరల్: రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



పాతపట్నం: కాగువాడలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస రూరల్: మండలంలోని గాజులకొల్లివలస గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు పర్యవేక్షించారు. 122 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం కొంతమంది రోగులకు రిఫర్ చేశారు. సర్పంచ్ మొండేటి కూర్మారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

602 మందికి ఆరోగ్య పరీక్షలు..

సారవకోట: మండలంలోని ధర్మలక్ష్మీపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 602 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు బొంతు పీహెచ్‌సీ వైద్యులు సుస్మిత తెలిపారు. ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఇతర ఆస్పత్రులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ రాంబాబు వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు.

347 మందికి వైద్య సేవలు

పాతపట్నం: మండలంలోని కాగువాడలో మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు వైద్య సేవలను పర్యవేక్షించారు. 347 మందికి వైద్యులు జి.సదాశివ, జి.అనిత, షణ్ముఖరావు వైద్య సేవలు అందించారు. ఈఓపీఆర్డీ కృష్ణారావు, సర్పంచ్ నల్లి జగదీశ్వరరావు, కంటి వైద్యురాలు రత్నప్రియ, రామారావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్



స్పీకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

ఆమదాలవలస: ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాంను ఆమదాలవలస మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన జి.రవి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్‌కు సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

సరుబుజ్జి: మండలంలోని చిన్నపాలెం గ్రామ సమీపం దంతపురిక్షేత్రంలో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మావుదూరి కృష్ణారావు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి సింధూర, తమలదళార్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదవితరణ చేశారు. ఈ పూజల్లో ఆలయ ధర్మకర్త మెండ సూర్యారావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రొట్టవలసలో శ్రీరామ దీక్షలు

సరుబుజ్జిలి: మండలంలోని రొట్టవలస రామానందాశ్రమ వ్యవస్థాపకుడు తొత్తడి వెంకటరమణస్వామి ఆధ్వర్యంలో పలు గ్రామాల భక్తులు బుధవారం శ్రీరామదీక్షలు స్వీకరించారు. దీక్ష తీసుకున్న భక్తులు శ్రీరామనవమి నాటికి అయోధ్య, భద్రాచలం దేవాలయాల్లో దీక్ష విరమిస్తారని తెలిపారు.

నేటినుంచి వాలీబాల్ టోర్నమెంట్

కొత్తూరు: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం నుంచి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎస్ఐ ఎం.ఎ.అహమ్మద్ బుధవారం తెలిపారు. మండలంలోని ఆసక్తి గల వాలీబాల్ క్రీడాకారులు తమ టీమ్ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. గురువారం నాటికి టీమ్‌లు నమోదు చేసుకున్న టీమ్‌లకే పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణం



ప్రహరీ నిర్మాణం చేపడుతున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల సమీపంలో గల మినీ స్టేడియం పక్కన ఉన్న బాలికల వసతి గృహానికి రూ.10 లక్షల ఏపీఈడబ్ల్యూడీపీ నిధులతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నామని ఎస్సీ కార్పొరేషన్ జేఈ రామారావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో ప్రహరీ నిర్మాణం పనులు పూర్తిచేయనున్నామన్నారు. వచ్చే ఏడాది బీసీ బాలికల వసతి గృహం వినియోగంలోకి వస్తుందన్నారు.

లక్ష్యాలు చేరుకోవాలి

మెళియాపుట్టి: ఉపాధి సిబ్బంది లక్ష్యాలు చేరుకునే దిశగా పనిచేయాలని ఎంపీడీఓ భాస్కరరావు సూచించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం పూర్తికావడానికి చాలా తక్కువ సమయం ఉందన్నారు. జాబుకార్డు కలిగి ఉండి, పనికి దరఖాస్తు చేసుకున్న ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని దినాల కల్పించాలన్నారు. ఈ నెలలో అధిక సంఖ్యలో వేతనదారులను పనిలో పెట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీఓ రవి, ఈసీ ఆదినారాయణ రెడ్డి, క్షేత్ర సాంకేతిక సహాయకులు ఉన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు



మహిళకు తాగునీటి బిందె అందిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: ఇంటింటికీ తాగునీటిని అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డి పనిచేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. మండంలోని పాతపాడులో రూ.22లక్షలు, లొద్దలకాగితాపల్లిలో రూ.11లక్షలు, వీరభద్రాపురంలో రూ.16లక్షలతో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన ఇంటింటికీ తాగునీటి కుళాయిలను బుధవారం ప్రారంభించారు. యరగాం గ్రామంలో రూ.92లక్షలతో నిర్మించనున్న తాగునీటి కుళాయి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం జగన్ తన సుదీర్ఘపాదయాత్రలో తాగునీటి కోసం మహిళలు పడుతున్న కష్టాలను స్వయంగా చూసి ప్రతీ ఇంటికి తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ బెవర కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, పలు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెరుగైన వైద్యం



తురకపేటలోని హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పేద మహిళలకు గృహయోగం
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామీణ ప్రాంత ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం తీసుకువచ్చారని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బొత్తాడసింగి, తురకపేట గ్రామాల్లో నిర్మించిన హెల్త్ వెల్త్ నూతన భవనాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పేద మహిళలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేశారు. వైద్యం కోసం పేదలు ఇబ్బంది పడకూడదనే ఆలోచనతో గ్రామ సచివాలయం పరిధిలో హెల్త్ వెల్త్ భవనాలు నిర్మించారన్నారు. పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాల వారికి ప్రభుత్వమే కార్పొరేట్ వైద్య సేవలు అందివ్వాలనే ఆలోచనతో ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షల వరకు పెంచిందన్నారు. ప్రతీ మండలానికి ఒక 108 అంబులెన్స్ వాహనాన్ని ఇచ్చారన్నారు. 104 వాహనాల ద్వారా డాక్టర్లను గ్రామాలకు పంపించి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన మందులు ఉచితంగా ఇస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా నిపుణులైన డాక్టర్లు గ్రామాలకు వస్తున్నారన్నారు. సెంటు భూమి కూడా లేని పేదింటి అక్కచెల్లెమ్మలకు ఇళ్ల స్థలాలతోపాటు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్నను గెలిపించాని కోరారు. ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మీ, తహసీల్దార్ ఎస్.రాణీఅమ్మాజీ, ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, వైస్ ఎంపీపీ శివ్వాల ఇందమ్మ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి, వైద్యులు ఎస్.సునీత, లక్ష్మీదీప్, నీతూ, ప్రియాంక, సర్పంచ్‌లు ఈగల భవాని, మొదలవలస యోగీశ్వరి, పార్టీ నాయకులు పల్లి సంజీవ్, ముద్దాడ లక్ష్మణరావు, ఈగల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆమదాలవలస రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి అన్నారు. తొగరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ చిన్నతనంలో కష్టపడి చదువుకుంటే జీవితం బాగుంటుందని విద్యార్థులకు సూచించారు. గురువులు చెప్పిన పాఠాలు నేర్చుకుని మంచి భవిష్యత్‌ను అందిపుచ్చుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఈ ఏడాది 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు వివిధ పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల స్వర్ణోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగదు, మెమెంటోలు అందజేశారు. హెచ్‌ఎం ఎం.పోలినాయుడు, ఉపాధ్యాయులు పేడాడ కృష్ణారావు, సురేష్, ఎన్.కృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

నేడు బహిరంగ వేలంపాట

ఆమదాలవలస: ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్‌లో, చింతాడ వారపు సంతలో, పట్టణంలోని కబేలా నిర్వాహణలో ఆశీలు వసూళ్లు చేసేందుకు గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించనున్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జి.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 4 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలంపాట ఉంటుందన్నారు. బహిరంగ వేలంపాటలో పాల్గొనేవారు ముందస్తుగా మున్సిపల్ అధికారులకు సమాచారం అందించి, తగిన ధ్రువపత్రాలతో హాజరవ్వాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డులో విద్యుత్ స్తంభాలకు గురువారం తీగలను అమర్చనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.భయ్యాన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఆమదాలవలస సబ్–స్టేషన్ పరిధిలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. చింతాడ, నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

సారవకోట: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ హెచ్.కె.కామాక్షి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం భేటీ బచావో బెటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, ప్రభుత్వాలు విద్య, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాల్లో కల్పిస్తున్న ప్రాధాన్యతల గూర్చి వివరించారు. బాలికలు చదువుతోపాటు క్రీడలు, నృత్యం ఇతర రంగాల్లో రాణించాలని సూచించారు. ఉన్నత స్థానాలకు వెళ్లాలంటే ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా చదవాలన్నారు. సూపర్‌వైజర్లు సునీత, సీతారత్నం, సుమలత ఉన్నారు.